సాక్షి
వికారాబాద్

సోమవారం । 20 । మే । 2024

మీ ఆధార్ సురక్షితమేనా?
రోజువారీ జీవితంలో అన్ని ముఖ్యమైన కార్యకలాపాలలో ఆధార్ కార్డు వినియోగం అగ్రభాగాన నిలుస్తోంది. 8లో▸



ప్రసవాలకు సెలవు!
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలన్న లక్ష్యం నీరుగారుతోంది. ఆస్పత్రుల్లో సరిపడా సిబ్బంది ఉండకపోవమే కారణం. 8లో▸



నత్తనడకన కొనుగోళ్లు!
ఆరుగాలం కష్టపడి పండించిన వరిధాన్యం అమ్ముకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ధాన్యం సేకరణను వేగవంతం చేయండి

జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్



వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాజేశ్వర్

కుల్కచర్ల: ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్ అధికారులను ఆదేశించారు. కుల్కచర్ల మండల పరిధిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఎర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి ధాన్యాన్ని వేగవంతంగా సేకరించాలని కోరారు. ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. డీసీఎంఎస్ ఇన్‌చార్జి వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు: ఎస్పీ కోటిరెడ్డి



అనంతగిరి: నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వానకాలం సాగు ప్రారంభమవుతున్న సమయంలో కొందరు తమ స్వలాభం కోసం అమాయక రైతులకు నష్టం కలిగించే విధంగా నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలను అమ్ముతున్నారన్నారు. ఈ విషయంపైన జిల్లాలోని రైతులు అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎవరైనా నకిలీ, కాలం చెల్లిన, ప్రభుత్వ నిషేధిత మందులు/విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే పోలీసులకు గాని సంబంధిత అధికారులకు గానీ ఫిర్యాదు చేయాలన్నారు. పోలీస్ అధికారులు జిల్లాలోని ఇతర అధికారులతో కలసి వ్యవసాయ విత్తనాల, ఎరువుల దుకాణాలపైన దాడులు చేయడంతో పాటు అక్రమార్కుల ఆట కట్టిస్తారన్నారు. జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందింతే తక్షణమే జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులకు గానీ డయల్ 100కు గానీ సమాచారం అందించాలని అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. నకిలీ, కాలం చెల్లిన విత్తనాల కేసులు నమోదైన వారిపైన పీడీ యాక్టులు కూడా పెట్టడం జరుగుతుందని ఎస్పీతెలిపారు.

పేదల పక్షపాతి సుందరయ్య

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్‌రాములు



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతగిరి: సుందరయ్య జీవితం అందరికీ ఆదర్శమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. వెంకట్‌రాములు, అరుణజ్యోతి అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సుందరయ్య చిన్ననాటి నుంచే అంటరానితనం, కుల వివక్ష, అసమానతలను సహించేవారు కాదన్నారు. రాబోయే రోజుల్లో దేశంలో మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా అందరికీ సమాన అవకాశాలు, హక్కులు సాధించుకునే వరకు ఎర్రజెండా ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్, జిల్లా నాయకులు సతీష్, శ్రీనివాస్, లాలయ్య, అనసూయ,రేణుక, లక్ష్మయ్య, గౌస్, రాములు, ముత్యం దేవిరెడ్డి, వెంకటమ్మ పాల్గొన్నారు.

‘బెల్టు షాపులు ఎత్తివేయండి’

షాద్‌నగర్: ఊళ్లో ఎక్కడ చూసినా బెల్టు దుకాణాలు వెలిశాయి.. ఏ గల్లీకి వెళ్లినా కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్నారు. దీంతో చాలామంది మద్యానికి బానిసై అనారోగ్యానికి గురవుతున్నారని, బెల్టు దుకాణాలు ఎత్తివేయాలని కోరుతూ ఓ యువకుడు ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం కందివనంలో చిన్నారులతో కలిసి వినూత్న నిరసన చేపట్టాడు. కొన్ని రోజులుగా గ్రామంలో బెల్టు దుకాణాల్లో జోరుగా మద్యం విక్రయిస్తున్నారని, మద్యానికి బానిసై చాలా మంది వృద్ధులు, యువకులు అనారోగ్యం బారిన పడుతున్నారని నిరసనకు దిగిన నవీన్ ఆందోళన వ్యక్తం చేశాడు. బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయించొద్దని కోరినా ఎవరూ వినడం లేదని.. దీంతో గ్రామ ముఖ్య కూడలిలో చిన్నారులతో కలిసి ఖాళీ మద్యం సీసాలతో నిరహార దీక్ష చేపట్టినట్లు తెలిపాడు. గ్రామంలో బెల్టు దుకాణాలు ఎత్తివేసే వరకు దీక్ష కొనసాగిస్తానని స్పష్టం చేశాడు. మహిళలు దీక్ష వద్దకు వచ్చి మద్దతు తెలిపారు.



జలం.. పదిలం

జల సంరక్షణలో వికారాబాద్ జిల్లా ముందంజ

- క్షేత్రస్థాయి పరిశీలనలో జాతీయ జల సంరక్షణ బృందం సంతృప్తి
- చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, నీటికుంటల నిర్వహణల పరిశీలన
- మొక్కల సంరక్షణ, ప్రజల భాగస్వామ్యంపై ఆరా..
- ఈ ఏడాది రాష్ట్రం నుంచి ఎంపికైన జిల్లా
- గతేడాది కూడా అనేక విభాగాల్లో అవార్డులు కైవసం

వికారాబాద్: జల సంరక్షణలో భాగంగా చేపడుతున్న పనుల్లో జిల్లా రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిచింది. గతేడాది కేంద్ర ప్రభుత్వం అందజేసిన అవార్డుల్లో అనేక విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్న జిల్లా ఈ ఏడాదిలో కూడా రేస్‌లో ముందుంది. వర్షపు నీటిని ఒడిసిపట్టడం.. వాటి వినియోగం.. సాధించిన ఫలితాల ఆధారంగా ఎంపిక చేసిన జాబితాలో తెలంగాణ నుంచి జాతీయ స్థాయిలో చోటు దక్కించుకుంది. జాతీయ జలశక్తి మంత్రాలయ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జల సంరక్షణ అవార్డులు ప్రధానం చేస్తూ వస్తుండగా ఈ ఏడాది జల సంరక్షణ విభాగంలో మన జిల్లాకు చోటు దక్కింది. ఇటీవల జాతీయ జల సంరక్షణ బృందం జిల్లాలో పర్యటించి ఆయా గ్రామాల్లో జల సంరక్షణ కోసం చేపట్టిన పనులను పరిశీలించి ఎవాల్యుయేషన్ (మూల్యాంకనం) చేసింది. పనుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన బృందం రాష్ట్రం నుంచి జిల్లాను ఎంపిక చేసినట్టు ప్రకటించింది. దీంతో మరోసారి జిల్లాకు జాతీయ అవార్డు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని జిల్లా అధికారులు తెలిపారు.

పరిశీలించిన పనులివే..

కేంద్ర జలశక్తి మంత్రాలయ నుంచి వచ్చిన జాతీయ బృందం ఇటీవల జిల్లా అధికారులతో కలిసి జిల్లా పరిధిలోని గంగ్యాడ, అనంతగిరి అటవీ ప్రాంతం, పులిమద్ది తదితర గ్రామాలను పరిశీలించి అక్కడ చేపట్టిన పనులను మైల్యాంకనం చేశారు. ఇందులో ప్రధానంగా చెక్ డ్యామ్‌ల నిర్మాణం, నిర్వహణ, చిన్న నీటికుంటల నిర్మాణం, సామాజిక ఇంకుడు గుంతలు, ఇళ్ల, పొలాల్లో తవ్విన ఇంకుడు గుంతలు, అడవుల్లో తవ్విన కండిత కందకాలను వారు పరిశీలించారు. మొక్కల పెంపకం, రోడ్లకు ఇరుపక్కల చేపట్టిన ప్లాంటేషన్, చెరువులు, చెక్‌డ్యామ్‌లలో పూడికతీత కోసం చేపట్టిన పనులు తదితర అంశాలను వారు పరిశీలించి మూల్యాంకనం చేశారు.



ఇటీవల పులిమద్దిలో జలసంరక్షణ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

చైతన్యంపై ఆరా..

జిల్లాను సందర్శించిన జాతీయ బృందం ప్రధానంగా అటవీ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, నీటి పారుదల శాఖ, భూగర్భజల వనరుల శాఖల ద్వారా నీటిని సంరక్షించేందుకు చేపట్టిన పనులపై దృష్టి సారించింది. ఈ శాఖల ఆధ్వర్యంలో జల సంరక్షణ కోసం చేపట్టిన పనులను పరిశీలించడంతో పాటు వాటి నిర్వహణ, ప్రజలు, రైతులు వాటి ద్వారా పొందుతున్న ఫలితాలపై కూడా ఆరా తీశారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడటంతో పాటు ఆయా ప్రాంతాల్లో పెరిగిన భూగర్భజలాలు, వాటిని రైతులు వినియోగిస్తున్న తీరును పరిశీలించారు. వాటితో ఆయా శాఖల దగ్గర ఉన్న గణాంకాలను సరిపోల్చుకుని నిర్ధారణకు వచ్చారు. జల సంరక్షణ కోసం చేపట్టిన పనులతో పాటు వాటిపై ప్రజలకు ఏ మేరకు చైతన్యం ఉంది. ప్రజల భాగస్వామ్యం ఎలా ఉంది అనే విషయాలపై కూడా వారు ఆరా తీశారు. ప్లాంటేషన్ విషయంలో నాటిన మొక్కల సంరక్షణ, ఎంత శాతం బతికాయి అనే విషయాలు సైతం పరిశీలించారు. వీటన్నంటిని పరిశీలించి ఒక అంచనాకు వచ్చిన ఆ బృందం రాష్ట్రం నుంచి వికారాబాద్ జిల్లాను ఎంపిక చేసినట్టు అధికారులు పేర్కొన్నారు.



‘సాక్షి’లో టీ20 వరల్డ్‌కప్ ట్రోఫీ



టీ20 వరల్డ్‌కప్ ట్రోఫీ టూర్‌లో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని ‘సాక్షి’ ప్రధాన కార్యాలయంలో ట్రోఫీని అభిమానుల కోసం ప్రదర్శనకు ఉంచారు. టోర్నీ ప్రసారకర్త స్టార్ స్పోర్ట్స్ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో 2007 టీ20 వరల్డ్‌కప్ విజేత భారత జట్టులో సభ్యుడు, 2011 వన్డే వరల్డ్ కప్ జట్టులో సభ్యుడు పీయూష్ చావ్లా, సాక్షి మీడియా గ్రూప్ సీఈఓ అనురాగ్ అగర్వాల్ పాల్గొన్నారు. ట్రోఫీ ప్రదర్శన కార్యక్రమంలో సాక్షి సిబ్బంది, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. – సాక్షి, హైదరాబాద్





కుంట్లూరు నుంచి తట్టి అన్నారం వెళ్లే మార్గం నుంచి సర్వే నంబర్ 207 ప్రభుత్వ భూమిలోని రోడ్డు

అడ్డ ‘దారులు’!

రియల్టర్ల ఇష్టారాజ్యం
- దర్జాగా ప్రభుత్వ భూముల ఆక్రమణ
- రైతులు, ఆలయాల పేరుతో రోడ్లు
- అడ్డుకోవాల్సిన అధికారులే కొమ్ముకాస్తున్న వైనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రియల్టర్ల ఆక్రమణ పర్వంతో సర్కారు భూములు కరిగిపోతున్నాయి. ప్రజావసరాలకు ఉపయోగపడాల్సిన రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు, మొయినాబాద్ మండలం కనకమామిడి, చేవెళ్ల మండలం ఎన్కేపల్లి, ఇబ్రహీంపట్నం మండలం నెర్రవల్లి, హయత్‌నగర్ మండలాల్లో ఈ తతంగం యథేచ్ఛగా సాగుతోంది. కొంత మంది రియల్టర్లు ప్రభుత్వ భూముల పక్కన ఉన్న పట్టా భూములు కొనుగోలు చేస్తున్నారు. ఫాంహౌస్‌లు, వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా భూముల్లోకి వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో పక్కనే ఉన్న ప్రభుత్వ భూములపై కన్నేస్తున్నారు. రైతులు, దేవాలయాల పేరు చెప్పి ప్రభుత్వానికి అర్జీలు పెడుతున్నారు. క్షేత్రస్థాయిలోని రెవెన్యూ అధికారులు రియల్టర్లతో కుమ్మక్కై...వారు అడిగిందే తడవుగా ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు రాసిచ్చేస్తున్నారు. సదరు రియల్టర్లు ఆయా వెంచర్లు పట్టణానికి, ప్రధాన రహదారికి అతి సమీపంలో ఉన్నట్లు బ్రోచర్లు ముద్రించి ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. ఇటు ప్రభుత్వాన్నే కాదు అటు కొనుగోలు దారులను మోసం చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని..

- మొయినాబాద్ మండలం కనకమామిడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 510లో ప్రభుత్వ భూమి ఉంది. ఓ రియల్టర్ ఆ పక్కనే 50 ఎకరాల పట్టా భూములు కొనుగోలు చేశాడు. రైతుల పేరుతో రూ.50 కోట్ల విలువ చేసే మూడు ఎకరాల ప్రభుత్వ భూమి నుంచి ప్రైవేటు వెంచర్‌కు సీసీ రోడ్డు వేసుకున్నాడు. ఎకరాల్లో కొనుగోలు చేసిన ఈ భూములను ఫాంహౌస్ పేరుతో గుంటలుగా విభజించి కొనుగోలు దారులకు రిజిస్ట్రేషన్లు కూడా చేశాడు. భూమి చుట్టూ ప్రీకాస్ట్ ప్రహరీ సహా భారీ ప్రవేశ ద్వారం, క్లబ్ హౌస్ నిర్మాణం చేపట్టాడు. కళ్లముందే ప్రభుత్వ భూమి కరిగిపోతున్నా పట్టించుకున్న నాథుడు లేడు.
- చేవెళ్ల మండలం ఎన్కేపల్లిలోని సర్వే నంబర్ 45లో ఏడెకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ గజం రూ.18 వేల పైమాటే. ఈ భూమికి ఆనుకునే నగరానికి చెందిన ఓ స్థిరాస్తి వ్యాపారికి 30ఎకరాలు ఉన్నాయి. నిజానికి ప్రభుత్వ భూమిలో పల్లెప్రకృతి వనం, క్రీడామైదానం కూడా ఏర్పాటు చేశారు. పల్లెపకృతి వనానికి ఏర్పాటు చేసిన రోడ్డునుంచే రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ స్థిరాస్తి వ్యాపారి దాని వెనుక వైపు ఉన్న భూమిలో ఓ గుడి ఉందని, వెళ్లడానికి దారి కావాలని అధికారులను కోరారు. ఆ మేరకు పంచాయతీ కూడా తీర్మానం చేసింది. అడిగిందే తడవుగా అధికారులు ప్రైవేట్ వెంచర్‌కు ప్రభుత్వ (ఎకరానికిపైగా) భూమిలో నుంచి రహదారి ఏర్పాటు చేశారు.
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 176లో 12.37 ఎకరాల్లో చిన్న చెరువు శిఖం భూమి ఉంది. దీనికి ఆనుకుని 174,175 సర్వే నంబర్లలో శిఖం పట్టా భూములు ఉన్నాయి. వెంచర్ సైతం ఏర్పాటు చేశారు. ఈ భూములపై ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. విలువైన ఈ వివాదాస్పద భూములపై ఇటీవల ఓ రియల్టర్ కన్నేశాడు. వెంచర్‌కు వెళ్లేందుకు సరైన దారి కూడా లేకపోవడంతో తనకున్న పలుకుబడిని ఉపయోగించాడు. రైతులను సాకుగా చూపించి, ఆ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి నుంచి 100 ఫీట్ల రోడ్డు ఇవ్వాలని అప్పటి రెవెన్యూ అధికారులను అభ్యర్థించాడు. ఆర్డీఓ, తహసీల్దార్, సర్వేయర్ రంగంలోకి దిగి కుంట్లూరు నుంచి తట్టి అన్నారం వెళ్లే మార్గం నుంచి సర్వే నంబర్ 207 ప్రభుత్వ భూమిలో 40 ఫీట్ల రోడ్డు (ఆరు గుంటలు) లెక్కించి దారి చూపించడం కొసమెరుపు.
- ఇబ్రహీంపట్నం మండలం నెర్రవల్లి సర్వే నంబర్ 26లోని సర్కారు భూమిలోని 8 ఎకరాలు రైతులకు అసైన్ చేశారు. ఇదే సర్వే నంబర్‌లో మరో 2.1 ఎకరాల భూమి మిగిలి ఉంది. ఇందులో కొంత వరకు రాళ్లు, రప్పలు ఉండగా అప్పట్లో అధికారులు అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఈ భూమి చుట్టూ స్థిరాస్తి వెంచర్లు వెలిశాయి. ఇక్కడ ఎకరం భూమి ధర రూ.2 కోట్ల వరకు పలుకుతుంది. దీంతో రియల్ వ్యాపారులు ఈ భూమిని కబ్జా చేశారు. రైతుల పేరుతో ఇదే భూమి నుంచి ప్రైవేటు వెంచర్లకు రోడ్డు వేసుకున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అండగా నిలిచినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు

- తాండూరులో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
- నిర్మాణ దశలోనే కూలుతున్న భవనాలు
- నోటీసులతోనే సరిపెడుతున్న అధికారులు



తాండూరు పట్టణంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనం

తాండూరు: తాండూరు పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక్కోసారి నిర్మాణ దశలోనే అవి కూలిపోతుండటంతో అభం శుభం తెలియని కూలీలు మృత్యువాత పడుతున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని సాయిపూర్ రోడ్డు మార్గంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి కోసం భారీ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే గతేడాది సెప్టెంబర్‌లో ఈ భవనానికి సంబంధించే 5వ అంతస్తులోని పైకప్పు కూలిపోయింది. అప్పట్లో మున్సిపల్ అధికారులు హుటాహుటిన పనులను పరిశీలించడంతో తదుపరి ఎలాంటి పనులు చేపట్టవద్దని భవనం యజమానికి నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ఓ వారం రోజుల వరకు పనులు నిలిపివేసిన సదరు యజమాని తదనంతరం తిరిగి పనులు మొదలు పెట్టి భవన నిర్మాణాన్ని పూర్తిచేశాడు. అలాగే తాండూరు పట్టణంలోని 7వ వార్డు పరిధిలోని లారీ పార్కింగ్ ఎదుట ఉన్న కాలనీలో స్థానిక వ్యాపారి 6 అంతస్తులతో భవనాన్ని నిర్మించారు. బుధవారం 6వ అంతస్తులో పైకప్పు, పిల్లర్లు కూలి సెంట్రింగ్ మేస్త్రీ చనిపోయాడు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన భవనం కారణంగా ఓ నిండు ప్రాణం బలైంది. ఇలాంటి ఘటనలు తాండూరులో నిత్యకృత్యంగా మారాయి. మున్సిపల్ అధికారులు ధనార్జనే ధ్యేయంగా అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు.

భవనాలకు డిమాండ్.

తాండూరు మున్సిపల్ పరిధి విస్తరించడంతో నూతన కట్టడాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మున్సిపల్ పరిధిలో మొత్తం 36 వార్డులు ఉండగా 14,500 వరకు నివాస గృహాలున్నాయి. దాదాపు 90వేల వరకు జనాభా ఉంది. నిన్న మొన్నటి వరకు రెండంతస్తుల వరకే పరిమితమైన భవనాలు ప్రస్తుతం 6 నుంచి 8 అంతస్తుల వరకు విస్తరిస్తున్నాయి. తాండూరు ప్రాంతంలో నాపరాతి పరిశ్రమతో పాటు సిమెంట్ కర్మాగారాలు ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున్న తాండూరుకు వలస వస్తున్నారు. దీంతో భవనాలకు డిమాండ్ పెరిగింది. దీంతో తాండూరు పట్టణంలో బహుళ అంతస్తుల నిర్మాణాలకు అదుపు లేకుండా పోయింది. పట్టణంలోని బస్ స్టేషన్ ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల్లో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడతున్నారు. పెద్ద ఎత్తున సాగుతున్న ఈ అక్రమ నిర్మాణాలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిర్మాణ సమయంలో ఎవరైనా కూలీలు చనిపోయినట్లు ఫిర్యాదు వస్తే కేవలం నోటీసులు అందించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం



మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ఎత్తైన భవనాలు నిర్మిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ నిబంధనల ప్రకారం జీ ప్లస్ 2 వరకు మాత్రమే భవనాల నిర్మాణానికి అనుమతులు ఇస్తాము. కానీ కొందరు మున్సిపల్ నిబంధల ప్రకారం అనుమతులు తీసుకొని 5 నుంచి 6 అంతస్తుల వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. వాటి వివరాలను సేకరిస్తున్నాం. ఇప్పటికే కొందరికి నోటీసులు అందించాము. అయినా కూడా నిర్మాణాలు చేపడతున్నారు. అలాంటివి గుర్తించి కూల్చివేయిస్తాం. – విక్రమ్‌సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్, తాండూరు

కాసుల కరెంట్!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యుత్ బిల్లుల రూపంలో శివారు సర్కిళ్లు డిస్కంకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. కొత్త కనెక్షన్లకు తోడు గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో నమోదైన విద్యుత్ డిమాండ్ సంస్థకు భారీ ఆదాయాన్ని సమకూర్చింది. గ్రేటర్‌లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో ఫిబ్రవరితో పోలిస్తే మార్చిలో రూ.217 కోట్ల విలువైన విద్యుత్‌ను అధికంగా ఖర్చు చేయగా.. మార్చితో పోలిస్తే ఏప్రిల్‌లో రూ.112 కోట్ల విలువైన విద్యుత్‌ను అధికంగా వాడారు. పెరిగిన ఈ వినియోగం సంస్థకు కొంత లాభాలు తెచ్చిపెట్టగా, సగటు వినియోగదారులకు మాత్రం బిల్లుల భారం తప్పలేదు. కొంత మంది వినియోగదారులు మే నెలలో చేతికందిన (ఏప్రిల్ నెల) బిల్లును చూసి షాక్ తిన్నారు. ఫిబ్రవరిలో నెలవారి సగటు విద్యుత్ బిల్లులు రూ.687.22 కోట్లు రాగా మార్చిలో రూ.903.81 కోట్లకు చేరింది. ఏప్రిల్‌లో రూ.1016.92 కోట్లకు పెరిగింది. మే నెల బిల్లులు మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. నెలవారీ బిల్లుల వసూళ్లలో సైబర్‌సిటీ మొదటి స్థానంలో ఉండగా, మేడ్చల్ రెండో స్థానంలో నిలవడం గమనార్హం.

స్లాబ్ రేట్ మారి..

నగరం శరవేగంగా విస్తరిస్తుంది. శివారు ప్రాంతాల్లో నిర్మాణాలు జోరందుకున్నాయి. నెలకు సగటున కొత్తగా 2500 కనెక్షన్లు యాడ్ అవుతున్నాయి. వీటితోకి తోడు సాధారణ మధ్య తరగతి గృహాల్లోనూ ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, ఓవెన్‌లు, గ్రీజర్లు సర్వ సాధారణమయ్యాయి. ఫలితంగా విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరుగుతోంది. గ్రేటర్‌లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 60 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, సాధారణ రోజుల్లో రోజుకు సగటున 55 మిలియన్ల విద్యుత్ వినియోగం జరిగేది. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడైంది. ఉపశమనం కోసం ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్ల వినియోగం రెట్టింపైంది.

ఎండలతో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం
- భారీగా బిల్లులు.. వినియోగదారుల గుండెలు గుభేల్
- రెండు నెలల్లోనే రూ.329 కోట్లు పెరిగిన ఆదాయం
- మొదటి స్థానంలో సైబర్‌సిటీ.. రెండో స్థానంలో మేడ్చల్

మార్చి నెలలో రోజు సగటు వినియోగం 70 నుంచి 75 మిలియన్ యూనిట్లు ఉండగా, ఏప్రిల్ చివరి నాటికి అనూహ్యంగా 85 నుంచి 90 ఎంయూలకు చేరుకుంది. అప్పటి వరకు నెలకు 150 యూనిట్ల లోపు వినియోగించిన వారు.. ఏప్రిల్ నెలలో ఏకంగా 250 యూనిట్లు దాటిపోయారు. స్లాబ్ రేటు పెరగడంతో బిల్లులు కూడా అమాంతం పెరిగిపోయాయి. మే నెలలో చేతికందిన బిల్లులు చూసి వినియోగదారులు లబోదిబోమంటున్నారు. ఇంత పెద్ద ఎత్తున బిల్లులు ఎలా చెల్లించాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు స్పీకర్ పరామర్శ


కుటుంబీకులతో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్‌లోని రామయ్యగూడ రోడ్డులో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం జరిగిన నాగలక్ష్మి హార్డ్‌వేర్ షాపు యాజమాని నేనావత్‌కృష్ణ, ఆయన కుటుంబీకులను ఆదివారం స్పీకర్ జి. ప్రసాద్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాద ఘటన తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మధుకర్, రాఘవన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొని.. యువకుడి మృతి


సత్రజిత్ దాస్ (ఫైల్)

పహాడీషరీఫ్: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన శశికాంత దాస్, అతని స్నేహితుడు సత్రజిత్ దాస్ అలియాస్ బుదదాస్(25)లు బతుకుదెరువు నిమిత్తం తుమ్మలూర్ గ్రామానికి వచ్చి స్థానికంగా ఉన్న పాలీప్లాస్ట్ కంపెనీలో పని చేస్తున్నారు. శనివారం సాయంత్రం సత్రజిత్ దాస్‌తో పాటు పరిచయస్తుడైన శృషాంత్ దాస్(35)లు తుక్కుగూడలో సామగ్రి తీసుకొచ్చేందుకు కంపెనీకి చెందిన బైక్‌పై వెళ్లి, తిరుగు ప్రయాణంలో దేవేంద్ర విద్యాలయ వరకు రాగా నిర్లక్ష్యంగా యూటర్న్ తీసుకుంటున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి సత్రజిత్ మృతి చెందాడు. శృషాంత్ చికిత్స తీసుకుంటున్నాడు. లారీ డ్రైవర్ శేఖర్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఆవుదూడల పట్టివేత

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న ఆవుదూడలను యాచారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తు ని నుంచి సాగర్‌రోడ్డుపై ప్రైవేట్ వాహనంలో పశువులను శనివారం రాత్రి నగరంలోని జియాగూడకు అక్రమంగా తరలిస్తున్నారు. ముందస్తు సమాచారం మేరకు పోలీసులు వా హనాల తనిఖీలు చేపట్టగా 25 ఆవుదూడ లను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. కాకినాడకు చెందిన డ్రైవర్ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. పశువులను నగరంలోని గోశాలకు తరలించినట్లు, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాల్ తెలిపారు.

నా భార్య హింసిస్తోంది.. రక్షణ కల్పించండి

ఓ ఇంగ్లిష్ ప్రొఫెసర్ ఆవేదన

సుల్తాన్‌బజార్: తన భార్య నుండి తనకు, తన తల్లిదండ్రులకు ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని ఓ బాధిత భర్త పోలీసులకు కోరారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు టిమూజియన్ తన తల్లిదండ్రులతో కలిసి మాట్లాడారు. తనకు లక్ష్మీ గౌతమితో వివాహం అయినప్పటి నుండి ఆమె తనను మానసికంగా శారీరకంగా హింసిస్తుందని ఆయన తెలిపారు. తన ఒంటిపై భార్య చేసిన గాయాలను చూపిస్తూ మీడియాతో తన గోడును చెప్పుకున్నారు. ఏపీ రాజోలుకు చెందిన టిమూజియన్‌కు అమాలాపురానికి చెందిన లక్ష్మీ గౌతమితో ఏడేళ్ల క్రితం పెళ్లి జరిగినట్లు తెలిపాడు. నగరంలోని మల్లారెడ్డి కాలేజీలో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ భార్యతో కలిసి అల్వాల్‌లో ఉంటున్నారు. ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. అయితే పెళ్లి అయినప్పటి నుండి తనను అకారణంగా తన భార్య హింసిస్తుందని వాపోయాడు. పలుమార్లు పెద్దల సమక్షంలో మాట్లాడినా తీరు మారలేదన్నారు. ఇటీవల తనను చంపేందుకు తనపై దాడి చేసినట్లు తెలిపాడు. ఈ విషయమై స్థానిక అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని అయితే పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. మహిళలకు ఒక చట్టం, పురుషులకు ఒక చట్టం ఉంటుందా అని ప్రశ్నించారు.

మీ ఆధార్ సురక్షితమేనా?

- వ్యక్తిగత డేటా చౌర్యానికి కేటుగాళ్ల యత్నాలు
- ఆధార్ కార్డు లాక్‌తో కళ్లెం వేయొచ్చంటున్న నిపుణులు

దోమ: రోజువారీ జీవితంలో అన్ని ముఖ్యమైన కార్యకలాపాలలో ఆధార్ కార్డు వినియోగం అగ్రభాగాన నిలుస్తోంది. దీని ద్వారా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం నుంచి ఆస్తి కొనుగోలు, బ్యాంక్ ఖాతా తెరవడం, ఐటీఆర్ దాఖలు చేయడం వంటి అన్ని అవసరమైన పనులను చేయవచ్చు. ఈ నేపథ్యంలో కొంతమంది నేరగాళ్లు ఆధార్ కార్డులను దుర్వినియోగం చేస్తున్నారు. వ్యక్తిగత సమాచారం నిక్షిప్తమై వివిధ అవసరాలకు ఇది ఉపయోగపడుతుంది. దీంతో ఆధార్‌ను ఎంతో సురక్షితంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అయితే ఆధార్ కార్డును కొంత మంది కేటుగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతూ వ్యక్తిగత సమాచారాన్ని తస్కరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు ద్వారా తమ వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ కేటుగాళ్ల ఊబిలో పడకుండా లాక్ వేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. లాక్ వేసుకుంటే మోసాలకు గురికాకుండా ఉంటారని పేర్కొంటున్నారు.

లాక్ వేయడం ఎలా?

- యూఐడీఏఐ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్డును జారీ చేయడంతో పాటు ప్రత్యేక సౌకర్యం కల్పిస్తూ బయోమెట్రిక్ సమాచారాన్ని కావాల్సినంత కాలం అందించి, లాక్ చేసుకునే వెసులుబాటును కల్పించింది. మళ్లీ అన్‌లాక్ చేసే వరకు ఆధార్‌ను ఎవరూ కూడా ఉపయోగించడానికి వీలు లేకుండా పటిష్టమైన వ్యవస్థను అందుబాటులో తీసుకువచ్చింది.
- యూఐడీఏఐ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయడం లేదా, మొబైల్ ఫోన్‌లో ఎంఆధార్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఎం ఆధార్‌లో ఆధార్ నంబర్, ఓటీపీ నమోదు చేసుకొని లాగిన్ అవ్వాలి.
- లాగిన్ తర్వాత మై ఆధార్ విభాగంలో లాక్ లేదా, అన్‌లాక్ కోసం బయోమెట్రిక్ ఎంపిక చేసుకోవాలి.
- గుర్తింపును ధ్రువీకరించడానికి ఆధార్‌తో పాటు ఓటీపీని నమోదు చేయాలి.
- ఆధార్ బయోమెట్రిక్ సమాచారాన్ని సురక్షితంగా దాచుకునేందుకు లాక్ బయోమెట్రిక్ ఎంపిక చేసుకోవాలి.
- ప్రక్రియ పూర్తయిన తర్వాత బయోమెట్రిక్ సమాచారం లాక్ అయినట్లు నిర్ధారణ సందేశం వస్తుంది.
- ఎప్పుడైనా బయోమెట్రిక్ సమాచారాన్ని అన్‌లాక్ చేసుకోవాలంటే మళ్లీ అదే విధానం ద్వారా చేసుకోవాలి.

బయోమెట్రిక్‌తో ప్రయోజనాలు

ఆధార్ బయోమెట్రిక్‌ను లాక్ చేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. బయోమెట్రిక్ సమాచారాన్ని లాక్ చేసినప్పుడు వేలిముద్ర, కనుపాపల స్కాన్, ముఖ గుర్తింపు డేటాను ఎవరూ ఉపయోగించలేరు. ఆధార్ ధ్రువీకరణ కోసం ఓటీపీ, రిజిస్టర్ మొబైల్ నంబర్‌ను మాత్రమే పంపిస్తారు. ఆ తద్వారా ఆధార్ ధ్రువీకరిస్తారు. ఇలా తమ వ్యక్తిగత సమాచారం ఏ సైబర్ కేటుగాళ్లకు తెలియకుండా లాక్ చేసుకునే అవకాశం ఉంది.

అప్రమత్తత అవసరం



ఆధార్ పట్ల అప్రమత్తత ఎంతో అవసరం. సైబర్ కేటుగాళ్లు ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడడమే కాకుండా ఆధార్ ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని సైతం లాగుతున్నారు. అవగాహన లేమితో ఎంతో మందిని మోసాలకు గురి చేసి అందినకాడికి దోచుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత సమాచారాన్ని భద్రపర్చుకునేందుకు లాక్ వేసుకోవాలి.

– శివ, మీసేవ నిర్వాహకుడు, బాస్‌పల్లి

సుందరయ్య సేవలు ఎనలేనివి


పరిగి: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్రాములు

పరిగి: సుందరయ్య ఆశయ సాధన కోసం తాము నిరంతరం కృషి చేస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్రాములు అన్నారు. భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుందరయ్య రాజకీయాల్లో కొత్త మార్గాన్ని చూపారన్నారు. రాజకీయ నాయకుడు ఎలా ఉండాలో సమాజానికి తెలియజేసి దేశంలో దోపిడీ, అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలని కలలు కన్నారన్నారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపించి 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారన్నారు. పదివేల గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాన్ని నింపిన యోధుడు ఆయన అన్నారు. ఆయన చేసిన సేవలను ప్రజలు ఎన్నటికీ మరవలేరన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటయ్య, సత్తయ్య, హబీబ్, యాదగిరి, రాఘురం తదితరులు పాల్గొన్నారు.


భూమిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పేదలకు భూములివ్వాలి

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని జైదుపల్లి గ్రామంలో సర్వే నంబర్ 116, 122లో గల 65 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు తిరిగి ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021లో పేదలు సాగు చేసుకుంటున్న భూమి చుట్టూ ఫారెస్టు అధికారులు ఎవరూ రాకుండా కాల్వలు తవ్వారని తెలిపారు. అధికారులు స్పందించి పేద కుటుంబాలకు వెంటనే కొత్త పాసుబుక్‌లు జారీ చేయాలని కోరారు. లేకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు మైపాల్, అనుమమ్మ, అనంతయ్య, పోచయ్య, అడివయ్య పాల్గొన్నారు.

గంట వ్యవధిలో గ్రామాల్లో విషాదం

ఆందోళన కలిగిస్తున్న అకాల వర్షాలు, పిడుగులు

యాలాల: ఉక్కపోతతో ఉన్న వాతవరణం ఒక్కసారిగా చల్లబడి, ఉరుములతో కూడిన వర్షం మండలంలో తీరని విషాదాన్ని మిగిల్చింది. ఆదివారం బెన్నూరు, జుంటుపల్లి గ్రామాల్లో పిడుగుపాటుతో ముగ్గురు రైతుల అకాల మరణం వారి కుటుంబాలకు తీవ్ర శోకాన్ని మిగిల్చింది. పిడుగుపాటుతో మృతి చెందిన బెన్నూరు వాసి గొల్ల వెంకప్ప, జుంటుపల్లికి చెందిన మంగలి శ్రీనివాస్, లక్ష్మప్పలు వ్యవసాయమే ఆధారంగా కుటుంబాన్ని పోషించుకునేవారు. వారి అకాల మరణంతో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. ఒకే రోజు, గంట వ్యవధిలో పిడుగుపాటుతో ముగ్గురు రైతులు మృతి చెందిన విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మండల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. యాలాల మండల ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం.

ప్రాణాల మీదకు..

ఎక్కువగా వరి, కంది, పత్తి పంటలను సాగుచేస్తుంటారు. ఇటీవల కాలంలో అకాల వర్షాల కారణంగా వరి సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ మద్దతు ధరతో విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం అకాల వర్షం కారణంగా తడిసిపోయి తేమ రాక పడరానీ పాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో పంటను కాపాడుకునేందుకు పిడుగుల వర్షంలో సైతం రైతులు అప్రమత్తతను మరిచి తమ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఈ విషయంలో రైతులు పలు జాగ్రత్తలు, సూచనలు తప్పక పాటించాలని కోరుతున్నారు. మెరుపులు, ఉరుములు ఉన్న సమయంలో పొలాల వద్ద ఫోన్లను వాడటం క్షేమం కాదని అంటున్నారు. ఉరుములతో కూడిన వర్షం పడుతున్నప్పుడు చెట్ల కిందకు వెళ్లరాదని, అటువంటి ప్రాంతాలకు దూరంగా ఉండటం మంచిదంటున్నారు. ఈ విషయంలో రైతన్నలు అప్రమత్తంగా ఉండాలని పలువురు కోరుతున్నారు.

రౌండప్ చేసి.. గొలుసు కొట్టేశారు

బంజారాహిల్స్: మద్యం మత్తులో ఉన్న నలుగురు ప్రయాణికులు పథకం ప్రకారం మరో ప్రయాణికుడిని చుట్టుముట్టి చాకచక్యంగా మెడలో ఉన్న గొలుసు తస్కరించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్డునెంబర్ 11 లోని ఉదయ్ నగర్‌లో నివసించే ఏసుదాసు(35) ప్రభుత్వ ఉద్యోగి. ఈనెల 17న సాయంత్రం మెహిదీపట్నంలో 49ఎమ్ బస్సు ఎక్కి కేర్ ఆసుపత్రి బస్‌స్టాప్‌లో దిగేందుకు మెట్లవద్దకు వచ్చాడు. అదే సమయంలో మద్యం మత్తులో ఉన్న నలుగురు వ్యక్తులు ఏసుదాసు దిగేందుకు యత్నిస్తుండగా రౌండప్ చేశారు. మీద పడుతూ న్యూసెన్స్ చేస్తుండగా ఏసుదాసు హెడ్‌సెట్ కిందపడిపోయింది. దాన్ని తీసుకునే క్రమంలో ఈ నలుగురు చాకచక్యంగా అతని మెడలో ఉన్న రెండున్నర తులాల గొలుసును కట్‌చేసి జారుకున్నారు. ఇంటికి వెళ్లిన తర్వాత మెడలో గొలుసుకోసం చూడగా కనిపించకపోవడంతో ప్రయాణికుల్లాగా బస్సు ఎక్కిన నలుగురు పథకం ప్రకారం చోరీ చేసి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రసవాలకు సెలవు!

- దౌల్తాబాద్ పీహెచ్‌సీలో సిబ్బంది కొరత
- ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్న వైద్యులు
- డెలివరీల కోసం వస్తున్న వారికి నిరాశ


దౌల్తాబాద్ పీహెచ్‌సీ

దౌల్తాబాద్: ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాలు పెంచాలని శస్త్ర చికిత్స లేకుండా నార్మల్ డెలివరీ అయ్యేలా చూడాలని ప్రభుత్వం అనేక సందర్భాలలో హామీ ఇచ్చింది. గత ప్రభుత్వం కేసీఆర్ కిట్, అమ్మ ఒడి వాహనం ద్వారా గర్భిణులను ఉచితంగా ఆస్పత్రులకు తీసుకెళ్లడం లాంటి పథకాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. కానీ ప్రస్తుతం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలకు వైద్య సిబ్బంది లేకపోవడంతో వేరే ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలనే ఆసక్తి ప్రజల్లో తగ్గిపోతుంది. కొన్ని నెలలుగా ప్రసవాలు చేసేందుకు ఆస్పత్రిలో సిబ్బంది ముందుకు రావడంలేదని తెలుస్తుంది.

గర్భిణుల అవస్థలు

మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. మండలంలో 33 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో అత్యధికంగా నిరుపేదలున్నారు. గిరిజన గ్రామాలున్నాయి. ఎక్కువ మంది ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారు. ఆస్పత్రికి రోజుకు వందకుపైగా ఓపీ వస్తుంటారు. ప్రస్తుతం సిబ్బంది కొరత కారణంగా వైద్యం అందని ద్రాక్షగా మారుతుంది. గర్భిణులకు సరైన వైద్యం అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రికి రెగ్యులర్ స్టాఫ్ నర్సు లేరు. ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. వారు ఇతర సమావేశాలకు ప్రభుత్వ కార్యకలాపాలకు వెళ్లడంతో ఆస్పత్రిలో వైద్యం చేసేవారులేరు. ప్రస్తుతం ఈర్లపల్లి పల్లె దవాఖానా వైద్యాధికారిణిని ఓపీ చూసేందుకు నియమించారు. దీంతో పేదలు, మధ్య తరగతి వారు ప్రైవేట్ ఆస్పత్రుల వైపు మొగ్గు చూపుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. వైద్యునిగా నేను ఒక్కడినే ఉన్నా. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు ఉన్నారు. కొన్ని నెలలుగా ప్రసవాలు చేయక రెఫర్ చేస్తున్నాం. ఈ విషయం ఉన్నతాధికారులకు వివరించాం.

– రతన్‌లాల్, వైద్యాధికారి

నేటి నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్

శంషాబాద్: పట్టణంలోని మినీస్టేడియంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. హిమబిందు తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఈ నెల 20 నుంచి 30 వరకు దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దోస్త్ వెబ్‌సైట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజేంద్రనగర్ అని ఉంటుందన్నారు. బీఏ, బీఎస్సీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

నక్ష బాట కబ్జాకు యత్నం


కందకం తవ్వి ఆందోళన తెలుపుతున్న రైతులు

రైతుల నిరసనతో ఆగిన వైనం

కందుకూరు: ఎన్నో ఏళ్లుగా నడిచే రోడ్డును కొందరు కబ్జా చేయడానికి యత్నించగా, రైతులు నిరసన తెలపడంతో నిలిచిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నేదునూరు గ్రామానికి సమీపంలోని సల్లోని బాయి అనే ప్రాంతంలో ఉన్న సుమారుగా 70 ఎకరాలకు పైగా ఉన్న పొలాన్ని విద్యుత్ ఉద్యోగులు సంఘంగా ఏర్పడి కొనుగోలు చేశారు. అందులో ఫాం ల్యాండ్ పనులు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామం నుంచి ఆ పొలం పక్కన 60 ఏళ్ల నుంచి నక్ష బాట ఉంది. ఆ బాటకు ఇరువైపులా ఆరు అడుగుల విస్తీర్ణంలో కాలువలు సైతం ఉన్నాయి. కాగా విద్యుత్ ఉద్యోగులు కొనుగోలు చేసిన పొలం పక్కన ఉన్న ఆ కాలువను పూడ్చి రోడ్డుపై కొంత భాగాన్ని ఆక్రమిస్తూ హద్దురాళ్లు పాతారు. దీంతో ఆగ్రహించిన స్థానిక రైతులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు ఆదివారం యూనియన్ ఉద్యోగులు చాలా మంది కార్లలో తమ పొలానికి వచ్చారు. విషయం తెలుసుకున్న రైతులు పొలాలకు వెళ్లే రోడ్డుపై అడ్డంగా కందకం తవ్వి అక్కడే నిరసన తెలిపారు. దీంతో ఆ యూనియన్ నిర్వాహకులు దిగివచ్చి, గతంలో ఉన్న మాదిరే రహదారిని వదిలిపెడతామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించి కందకాన్ని పూడ్చి వేసి నిరసన విరమించారు.


కర్షకులతో మాట్లాడుతున్న విద్యుత్ యూనియన్ నాయకులు

పిడుగుపాటుకు జాగ్రత్తలే ముఖ్యం

- వర్షం కురిసినప్పుడు చెట్ల కిందకు వెళ్లొద్దు
- మెరుపులను చూసేందుకు ప్రయత్నించొద్దు


మృతి చెందిన కాడెద్దుల వద్ద బోరున విలపిస్తున్న రైతు కుటుంబం

షాబాద్: వేసవి పూర్తి కాక ముందే అకాల వర్షాలు కురుస్తున్నాయి. బలమైన ఈదురుగాలులతో వాన పడేటప్పుడు మెరుపులు వచ్చి పెద్ద శబ్దాలతో పిడుగులు పడతాయి. వీటికి బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. అందుకే మనుషులతో పాటు జంతువులు చనిపోతాయి. పిడుగుల ప్రభావానికి పచ్చని చెట్లు సైతం కాలిపోతుంటాయి. ఎక్కువగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులే పిడుగుపాటుకు బలవుతుంటారు.

పిడుగు అంటే?

ఆకాశం కారుమబ్బులతో నిండినప్పుడు మబ్బు పైభాగంలో ధనశక్తి, కింది భాగంలో రుణశక్తి ఉంటాయి. ఈ రెండు ఆకర్షణకులోనై అత్యధిక విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. చుట్టూ ఉన్న గాలిలో సుమారుగా 30 వేల డిగ్రీల సెంటిగ్రేడ్ వేడి ఉత్పత్తి అవుతుంది. అదే మెరుపు. ఇలా వేడెక్కిగాలి ఒక్కసారిగా వ్యాకోచం చెందితే పెద్ద శబ్దం వస్తే అదే ఉరుము. ఒక్కోసారి మెరుపుతో కూడిన విద్యుత్ భూమి మీదకు చేరుతోంది దాన్నే పిడుగు అంటారు. చర్మం జలదరింపునకు గురవుతున్నా.. దగ్గర్లో లోహ వస్తువులు ఊగుతున్నా పిడుగుపాటుకు సంకేతంగా భావించాలి.

మిలియన్ మెగావాట్ల శక్తి

వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. ఆకాశంలో ఉరుములు, మెరుపులు వస్తుంటే చెట్ల కిందకు, విద్యుత్ టవర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి వెళ్లొద్దు. పిడుగుపడే సమయంలో ఆకాశంలోని మెరుపులు అత్యధిక శక్తిని కలిగి ఉంటాయి. కాబట్టి ఆ వెలుతురును చూసేందుకు ప్రయత్నించవద్దు. పిడుగుకు కొన్ని మిలియన్ మెగావాట్ల శక్తి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలి.

సమయస్ఫూర్తితో ఉండాలి

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. ఒకవేళ వీలు కాకపోతే సమయస్ఫూర్తితో వ్యవహరించి.. మోకాళ్లపై చేతులు, తల పెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. దీనివల్ల సమీపంలో పిడుగు పడినా అందులోని విద్యుత్ ప్రభావం తక్కువగా ఉండి బతికేందుకు అవకాశాలు ఉంటాయి. పిడుగు పడుతుందని అనిపించినప్పుడు రబ్బర్ చెప్పులు వేసుకోవడం మంచిది. ఒకవేళ వేసుకోలేని పరిస్థితి ఉన్నప్పుడు కాలును భూమి మీద పూర్తిగా అనించొద్దు. కాలి వేళ్ల మీద ఉండేందుకు ప్రయత్నించాలి.

విద్యుత్ పరికరాలకు నష్టం

పిడుగు పడినప్పుడు విద్యుత్ పరికరాలను ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉంటుంది. ఉరుములు, మెరుపులు వస్తుంటే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి. ఇంట్లో ఎలక్ట్రానిక్ పరికరాలైన టీవీ, రిఫ్రిజిరేటర్, సెల్‌ఫోన్ వంటి వాటిని వినియోగించకపోవడం ఉత్తమం. అలాగే మెరుపులు వస్తున్నప్పుడు ఆరుబయట స్నానం చేయడం, వంట పాత్రలు కడగడం చేయవద్దు. లోహపు వస్తువుల ద్వారా విద్యుత్ ప్రవహించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

మాడ్గులలో కాడెద్దులు మృతి

మాడ్గుల: మండలంలోని గిరికొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు సంబంధించి కాడెద్దులు ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అబ్దుల్ ఖాదర్ వ్యవసాయ పనుల నిమిత్తం రెండు కాడెద్దులను తన పొలం వద్దకు తీసుకెళ్లారు. ఇంతలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం రావడంతో పిడుగు పడింది. దీంతో కాడెద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. తనకు రూ.70 వేల నష్టం వాటిల్లిందని రైతు బోరున విలపించారు. ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సూర్యుడి కన్నా ఎక్కువ వేడి



సూర్యుడి ఉపరితలం మీద 5వేల డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటే.. పిడుగు పడినప్పుడు 29 వేల డిగ్రీలు ఉత్పత్తి అవుతుంది. పిడుగుకు సూర్యుని ప్రభావం కన్నా 5 రెట్లు ఎక్కువ వేడి ఉంటుంది.

– డాక్టర్ దామోదర్, జిల్లా ఉపవైద్యాధికారి

ముట్టుకుంటే షాక్ రాదు



పిడుగుపాటుకు గురైన వ్యక్తిని ముట్టుకుంటే షాక్ రాదు. వెంటనే బాధితుడికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించాలి. పిడుగుల సమయంలో విద్యుత్ పరికరాల కనెక్షన్ తీసివేయడం మంచిది.

– నరేందర్‌నాయక్, విద్యుత్ ఏఈ, షాబాద్

అప్రమత్తత అవసరం



మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నప్పుడు రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. వాతావరణ పరిస్థితులను బట్టి వెంటనే అప్రమత్తం కావాలి. పశువులను, మేకలు, గొర్రెలను చెట్ల కింద ఉంచకూడదు. రైతులు సైతం చెట్లకు దూరంగా ఉండాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, పశువైద్యాధికారి, రేగడిదోస్వాడ

దూసుకొచ్చిన మృత్యువు

లారీ ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడి దుర్మరణం

- తీవ్ర విషాదంలో కుటుంబసభ్యులు, విద్యార్థులు


శ్రీరాములు (ఫైల్)

మంచాల: రోడ్డు ప్రమాదం ఓ నిండు ప్రాణాన్ని బలికొంది. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పే ప్రభుత్వ ఉపాధ్యాయుడు అనంత లోకాలకు చేరుకొని అటు కుటుంబ సభ్యులు, ఇటు విద్యార్థులను తీవ్ర విషాదంలోకి నెట్టి వేశాడు. ఈ హృదయ విదాకర సంఘటన మంచాల మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రవి నాయక్ కథనం ప్రకారం.. యాచారం మండలం నల్లవెల్లి గ్రామానికి చెందిన బట్టు శ్రీరాములు(40) వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ప్రస్తుతం ఆయన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇంజాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఆదివారం ఉదయం స్వగ్రామం నుంచి బైక్‌పై సోదరిని చూడటానికి యాదాద్రి భువనగిరి జిల్లా మర్రిగూడ మండలం కుదాభక్షిపల్లికి బయలు దేరారు. మార్గమధ్యలో రంగాపూర్ ఎక్స్‌రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా అతి వేగంగా వస్తున్న ఓ లారీ ఆయన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆయన మరణం తీరని లోటు

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు విడిచిన శ్రీరాములు లోటు తీరనిదని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ్ పేర్కొన్నారు. శ్రీరాములు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కేవలం ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠాలు బోధించడమేగాకుండా సమాజం పట్ల గౌరవంతో శ్రీరాములు మెలిగారని గుర్తు చేశారు.